ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3

శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 28 జనవరి 2024

జేఈఈ మెయిన్స్‌కు 393 మంది హాజరు

ఎచ్చెర్ల, జనవరి 27: జిల్లాలోని రెండు కేంద్రాల్లో శనివారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్షకు 393మంది విద్యార్థులు హాజరయ్యారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం)లో రెండు షిఫ్టుల్లో కలిపి 200కు 196 మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల)లో 200కు 197 మంది హాజరయారు. మొత్తం 400 మందికి 393 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలు వచ్చే నెల 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి.


శివానీలో హాల్‌టిక్కెట్ల పరిశీలన


శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ

విశాఖ వెళ్లేందుకు నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికుల అవస్థలు


శ్రీకాకుళం : బస్సు వద్ద ప్రయాణికులు, విద్యార్థుల రద్దీ

జగనన్నా.. నీకో దండం

- భీమిలి సభకు 154 ఆర్టీసీ బస్సుల కేటాయింపు
- ప్రైవేటు వాహనాలు సైతం మళ్లింపు
- ఉసూరుమన్న జిల్లా ప్రయాణికులు
- ప్రభుత్వతీరుపై మండిపాటు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

'జగనన్నా.. నీకోదండం. ఇలా కూడా ఇబ్బందులు పెడతారా?' అంటూ... సిక్కోలు జనం ప్రభుత్వం, ముఖ్యమంత్రి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం విశాఖ జిల్లా భీమిలిలో సీఎం అధ్యక్షతన వైసీపీ సభ నిర్వహించారు. ఇందుకోసం జిల్లా నుంచి 154 ఆర్టీసీ బస్సులను తరలించారు. పలాస డిపో నుంచి 50 బస్సులు, టెక్కలి నుంచి 29 బస్సులు, శ్రీకాకుళం ఒకటో డిపో నుంచి 38, రెండో డిపో నుంచి 52 బస్సులను పంపించారు. వీటితోపాటు పాలకొండ డిపో నుంచి 15బస్సులు కేటాయించారు. కొన్ని పాఠశాలల బస్సులు, ప్రైవేటు వాహనాలను సైతం భీమిలి సభకు మళ్లించేశారు. దీంతో జిల్లా ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీకావు. జిల్లాకేంద్రానికి రోజూ పలు ప్రాంతాల నుంచి వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా బస్సులు లేక గంటల పాటు నిరీక్షించి ఇబ్బందులు పడ్డారు.

● బోసిపోయిన కాంప్లెక్సులు

శ్రీకాకుళంతో సహా ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, ఆమదాలవలస, నరసన్నపేట, పాతపట్నం, సోంపేట ఆర్టీసీ కాంప్లెక్సులు బోసిపోయాయి. కనీసం రెండు మూడు గంటలకోసారి బస్సు రావడం.. దానికోసం గంటల తరబడి ఎదురుచూస్తున్న ప్రయాణికులకు సీట్లు లేకపోవడంతో ఆటోలపై ఆధారపడ్డారు. ఈక్రమంలో ఆటోలు కిక్కిరిసిపోయాయి. ఇదిలా ఉండగా.. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విశాఖ వెళ్లేందుకు వందల సంఖ్యలో నాన్‌స్టాప్ టిక్కెట్‌కౌంటర్ వద్ద భారీక్యూలో గంటలకొద్దీ ప్రయాణికులు నిరీక్షించారు. వారంతా సీఎంను, ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. ఇటీవల నారా లోకేశ్ పాదయాత్ర ముగింపు సభకు బస్సులు కేటాయించని ప్రభుత్వం.. ఇప్పుడు భారీసంఖ్యలో తరలించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. బస్సులు ఎన్ని గంటలకు వస్తాయనే సమాచారాన్ని కూడా సిబ్బంది చెప్పలేకపోవడంపై మండిపడ్డారు. బస్సులన్నీ సీఎం సభకు కేటాయిస్తే తమ లాంటి సామాన్య ప్రయాణికుల పరిస్థితి ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు.


టెక్కలి : బస్సులు లేక నిర్మానుష్యంగా కాంప్లెక్స్

అక్కడ సభ.. ఇక్కడ వాహనాల నిలుపుదల

నందిగాం, జనవరి 27: విశాఖ జిల్లా భీమిలిలో ఏర్పాటు చేసిన సీఎం జగన్ సభను దృష్టిలో పెట్టుకొని శనివారం నందిగాం పరిధిలో జాతీయరహదారిపై వాహనాలను నిలుపుదల చేశారు. సభకు ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు నందిగాం ఎస్‌ఐ మహ్మద్ అమీర్‌ఆలీ ఆధ్వర్యంలో సిబ్బంది విశాఖ వెళ్లే లారీలను నిలుపుదల చేశారు. కిలోమీటరుకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో లారీ డ్రైవర్లు, సిబ్బంది అసహనం చెందారు. అలాగే ఆర్టీసీ బస్సులు సభకు తరలివెళ్లడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.


నందిగాం హైవేపై నిలిచిన లారీలు

ప్రయాణికులకు అవస్థలు

టెక్కలి: టెక్కలి డిపో పరిధిలో 52 ఆర్టీసీ సర్వీసులకుగాను 29 ఆర్టీసీ సర్వీసులు భీమిలిలో జగన్ సభకు తరలించారు. ముఖ్యంగా పల్లెవెలుగు బస్సులు తిరిగే రూట్లలో ఆర్టీసీ సర్వీసులన్నీ నిలిపివేయడంతో కాంప్లెక్స్ బోసిపోయింది. టెక్కలి-హూండీ, టెక్కలి-పాతపట్నం, టెక్కలి-కొత్తపల్లి, టెక్కలి- ఇచ్ఛాపురం, టెక్కలి-విశాఖ, ఇంటర్‌స్టేట్ బస్సు సర్వీసులు కూడా నిలిపివేసి భీమిలి సభకు తరలించారు. దీంతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సు సౌకర్యాలు లేక అగచాట్లు పడ్డారు. గంటలకొద్దీ కాంప్లెక్స్‌ల్లో పడిగాపులు కాశారు. చివరకు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదునుగా వారు అధిక చార్జీలు వసూలు చేశారు.

దర్జాగా కబ్జా

- వైసీపీ కీలకనేత ఇలాఖాలో 3 ఎకరాల చెరువు మాయం
- అర్ధరాత్రి వేళ మట్టి తరలిస్తూ కప్పేస్తున్న స్థానిక నేత
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న అధికారులు
- కలెక్టర్ స్పందనలో ఫిర్యాదుకు గ్రామస్థుల సన్నద్ధం

అధికారం ఉంది కదా అని బరి తెగించాడు. కీలక నేత అండ ఉందంటూ కబ్జాకు తెరలేపాడు. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువుకు ఎసరు పెట్టేశాడు. తన మనుషులను రంగంలోకి దింపాడు. మట్టి వేసి చెరువును కప్పేశాడు. ఇంత జరిగినా అధికారులు చోద్యం చూస్తున్నారు. సర్వే చేస్తామంటూ నింపాదిగా చెబుతున్నారు. ఈ వ్యవహారాన్ని చూసి ఆ గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

(శ్రీకాకుళం క్రైం)

శ్రీకాకుళం మండలం సింగుపురంలో ముసలం గుండం చెరువుకు దశాబ్దాల కాలం నాటి చరిత్ర ఉంది. దాదాపు మూడు ఎకరాల్లో ఉన్న ఈ చెరువును ఆనుకుని కొన్ని గ్రామాలతో పాటు కూతవేటు దూరంలో జాతీయ రహదారి ఉంది. పరిసరాల్లో భూముల ధర ఎకరా రూ.కోట్లలో ఉంది. అంతే.. ఈ చెరువుపై స్థానిక అధికారపార్టీ ప్రజాప్రతినిధి కన్ను పడింది. ఎలాగోలా దాన్ని కబ్జా చేయాలని భావించాడు. ఈ విషయాన్ని కీలకనేతకు చేరవేశాడు. సదరు నేత భరోసా ఇవ్వడంతో రంగంలోకి దిగాడు. శుక్రవారం రాత్రి భారీ వాహనాలతో మట్టిని వేసి.. చెరువు కప్పి.. చదును చేసేశాడు. ఈ వ్యవహారం బహిరంగంగానే సాగుతున్నా గ్రామస్థులు నోరు మెదపలేని పరిస్థితి. సింగుపురం చెరువు ప్రభుత్వ ఆధీనంలోనే ఉందని గ్రామస్థులు చెబుతున్నారు. సర్వే నెంబర్ 274/2లో చెరువు స్థలం ఉందని స్థానిక ప్రజాప్రతినిధి చెబుతున్నారు. కాదు.. ఇది సర్వేనెంబర్ 270లో 4 ఉందని స్థానిక వీఆర్వో అంటున్నారు. ఇలా చెరువుపై పొంతనలేని వాదనలు వినిపిస్తున్నారు. ఒకప్పుడు సింగుపురం పరిసర ప్రాంతాల వాసులంతా ఈ చెరువునీటిని తాగేందుకు వినియోగించేవారు. ఏటా పండగ రోజుల్లో కొండమ్మతల్లి దేవతామూర్తులకు.. ఈ చెరువులో స్నానాలు ఆచరించి ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లడం ఆనవాయితీ. కాలక్రమేణ చెరువులో నీరు ఇంకిపోవడంతో ప్రస్తుతం ఎవ్వరూ అటువైపు చూడటం లేదు. ఇదే అదునుగా గ్రామం మధ్యలో ఉన్న చెరువును అధికారపార్టీ స్థానిక ప్రజాప్రతినిధి శుక్రవారం రాత్రి నుంచి లారీలతో మట్టిని తరలిస్తూ కప్పేశాడు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంపై గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.




సింగుపురంలో కప్పేసిన చెరువు.. ఇనసెట్‌లో మట్టిని తీసుకొస్తున్న లారీలు



● పూర్వీకుల కాలం నాటిది

చెరువు పూర్వీకుల కాలం నాటిది. ఒకప్పుడు స్నానాలు చేసేవాళ్లం. ఈ నీటినే తాగేవాళ్లం. రాత్రికిరాత్రే చెరువు కప్పడంతో ఏం జరుగుతుందో తెలియడం లేదు. నా చిన్నప్పటి నుంచీ ఇది ప్రభుత్వ చెరువుగానే అనుకున్నాను. ఇలా చేస్తారని కలలలో అనుకోలేదు.

- పిన్నింటి అప్పలరాజు, సింగుపురం



● కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

తరతరాలుగా ఉన్న చెరువును కబ్జా చేస్తే ఊరుకోం. గ్రామస్థులంతా ఈ విషయంపై కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేస్తాం. ఈ చెరువులో ఏటా కొండమ్మతల్లి ఉత్సవ విగ్రహ మూర్తులకు స్నానాలు చేయించేవాళ్లం. చెరువును కాపాడుకునేందుకు ఎంతటి పోరాటానికైనా సిద్ధం.

- నిమ్మాడ రాము, సింగుపురం

● పూర్తిస్థాయిలో సర్వే చేస్తాం

సింగుపురంలో ముసలం గుండం చెరువు కబ్జా విషయమై సర్వే చేయాలని సిబ్బందికి ఆదేశించాను. ప్రస్తుతం చెరువులో జరుగుతున్న పనులను నిలిపివేయించాం. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతాం.

- ఎన్.వెంకటరావు, తహసీల్దార్, శ్రీకాకుళం

సీఎం సభకు వెళ్తుండగా..

● బస్సు వెనుక టైర్ కిందపడి క్లీనర్ మృతి


లక్ష్మణరావు (ఫైల్)

కోటబొమ్మాళి, జనవరి 27: సీఎం జగన్ సభకు బస్సులో వెళ్తుండగా అపశ్రుతి చోటుచేసుకుంది. బస్సు వెనుక టైర్ కింద పడి ఓ క్లీనర్ మృతి చెందగా.. విషాదం నెలకొంది. కోటబొమ్మాళిలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమిలిలో సీఎం జగన్ సభకు పార్టీ శ్రేణులను, ప్రజలను తరలించేందుకు కోటబొమ్మాళి నుంచి ఏడు బస్సులు కేటాయించారు. ఇందులో ఒక బస్సు శనివారం ఉదయం స్థానిక శ్రీ కొత్తమ్మతల్లిని దర్శించుకుని బయలుదేరింది. కొన్ని నిమిషాల వ్యవధిలోనే.. స్థానిక ఇండియన్ బ్యాంక్ సమీపానికి వచ్చేసరికి బస్సు ముందు డోర్ వద్ద ఫుట్‌రెస్ట్‌పై నిల్చున్న క్లీనర్ ఉప్పాడ లక్ష్మణరావు(40) అదుపు తప్పి కాలుజారి పడిపోయాడు. బస్సు వెనుక టైరు లక్ష్మణరావు తలపై నుంచి వెళ్లిపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ఉన్న కొంతమంది వైసీపీ కార్యకర్తలు సంఘటనను గుర్తించి కేకలు వేయడంతో డ్రైవర్ ఉప్పాడ ధనుంజయరావు బస్సును నిలిపేశారు. అప్పటికే లక్ష్మణరావు ప్రాణాలు కోల్పోవడంతో విషాదంలో మునిగిపోయారు.

● డ్రైవర్ ధనుంజయరావు, క్లీనర్ లక్ష్మణరావు అన్నదమ్ములు.

వీరి స్వస్థలం టెక్కలి మండలం పోలవరం పంచాయతీ లచ్చన్నపేట. 20ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం ఎచ్చెర్ల మండలం కుశాలపురం వెళ్లిపోయారు. ప్రైవేటు బస్సులో దినసరి వేతనానికి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మణరావుకు భార్య శాంతి కుమారితో పాటు పదోతరగతి చదువుతున్న కుమార్తె పవిత్ర, 8వ తరగతి చదువుతున్న కుమారుడు జగదీష్ ఉన్నారు. వీరు కుశాలపురం వద్ద పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. లక్ష్మణరావు మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. తామంతా రోడ్డున పడ్డామని.. ఇక తమకు దిక్కెవరని లబోదిబోమంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ షేక్‌మహ్మద్ అలీ తెలిపారు.

సభకు వెళ్లివస్తూ.. మరొకరు


చిట్టిబాబు (ఫైల్)

ఎచ్చెర్ల: సీఎం జగన్ సభకు వెళ్లి వస్తూ.. రోడ్డుప్రమాదంలో మరొకరు మృతి చెందారు. ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకు చెందిన అంపోలు చిట్టిబాబు (64) శనివారం భీమిలిలో సీఎం సభకు వెళ్లాడు. సభ ముగిసిన తర్వాత వేరొక బస్సులో వచ్చి.. కుశాలపురం బైపాస్ వద్ద దిగాడు. ఆ సమయంలో రోడ్డు దాటుతుండగా.. విశాఖ నుంచి వస్తున్న ఓ కారు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోసుమార్టం నిమిత్తం చిట్టిబాబు మృతదేహాన్ని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చిట్టిబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజమండ్రి సభకు వెళ్లొద్దు

● ఉపాధ్యాయ సంఘాలకు ముందస్తు నోటీసులు

కోటబొమ్మాళి, జనవరి 27: పాత పింఛన్ సాధన కోసం రాజమండ్రిలో ఈ నెల 28న నిర్వహించనున్న సభకు వెళ్లొద్దు అంటూ ఉపాధ్యాయ సంఘ నేతలకు స్థానిక పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. శనివారం కోటబొమ్మాళి మండలం దంత ప్రభుత్వ పాఠశాలకు పోలీసులు వెళ్లి.. యూటీఎఫ్ జిల్లా నాయకుడు గొండు నారాయణ రావుకు నోటీసులు ఇచ్చారు. కాగా.. సభకు వెళ్లకుండా అడ్డుకోవడం తగదని యూటీఎఫ్ జిల్లా నాయకులు నారాయణరావు, వై.వాసుదేవరావు ప్రభుత్వం, పోలీసుల తీరుపై మండిపడ్డారు.


నారాయణరావుకు నోటీసులు ఇస్తున్న పోలీసులు

ఆ శాసనం 11వ శతాబ్దానిది

● ఇప్పిలిలో గుర్తించిన పురావస్తు శాఖ

శ్రీకాకుళం క్రైం, జనవరి 27: శ్రీకాకుళం మండలం ఇప్పిలి గ్రామ పొలాల్లో ఇటీవల బయటపడిన శాసనం 11వ శతాబ్దం నాటిదని ఏపీ పురావస్తు శాఖ శనివారం పేర్కొంది. బండరాయి మీద ఉన్న రాతలను తెలుగు భాషలో 11వ శతాబ్దపు సీఈలోని అక్షరాలతో రాసినట్లు ఏపీ ఆర్కియాలజికల్ ఎం.స్వామినాయక్ సౌజన్యంతో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. తూర్పు గంగరాజు అనంతవర్మదేవ 61వ పాలన సంవత్సరంలో ఈ శాసనం విడుదల చేసినట్లు తెలుస్తోంది. ఇప్పిలి దేవుడికి శాశ్వతదీపం వెలిగించేందుకు కొంత భూమిని దానంగా ఇచ్చినట్లు, దీన్ని యరక మానయ్యకు అప్పగించినట్లు శాసనంలో రాసి ఉన్నట్లు పురావస్తు శాఖ పేర్కొంది.



వైసీపీ పాలనలో అంతా దోపిడీ

- ఆ పార్టీ నేతలు ఇసుకాసురులు
- ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవి ధ్వజం

జలుమూరు, జనవరి 27: వైసీపీ పాలనలో అంతా దోపిడీ సాగుతోందని, ఆ పార్టీ నేతలు ఇసుకాసురుల అవతారమెత్తారని ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ధ్వజమెత్తారు. 'టీడీపీ పిలుస్తోంది.. రా.. కదలిరా'.. కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీముఖలింగంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కూన రవికుమార్ మాట్లాడుతూ 'నరసన్నపేటలో ప్రజలు ఒక ఎమ్మెల్యేను గెలిపిస్తే ముగ్గురు ఎమ్మెల్యేలు అధికారం చెలాయించి జిల్లాను దోచుకు న్నారు. రైతుల భూములను కూడా లాక్కునేలా వైసీపీ నేతలు ప్రవర్తిస్తున్నారు. రాష్ట్రానికి ఇంత అవినీతిపరుడైన సీఎం అవసరమా' అని ప్రశ్నించారు. వైసీపీని సాగనంపాలని పిలుపునిచ్చారు.


ఎంపీ రామ్మోహన్, కూన రవి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందన్నారు. భూబకాసురులు, ఇసుకాసురుల అవతారమెత్తి రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలని.. నరసన్నపేటలో విజయఢంకా మోగించాలని కార్యకర్తలకు సూచించారు.

● మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీముఖలింగం అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ముందుగా చల్లవానిపేట కూడలి నుంచి టిడిపి శ్రేణులు ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ చేపట్టారు. జలుమూరు మీదుగా కొమనాపల్లి, అచ్యుతాపురం, నగిరికటకం మీదుగా శ్రీముఖలింగం చేరుకొని సమావేశం నిర్వహించారు. ర్యాలీలో అడుగడుగునా ప్రజలు నీరాజనం పలికారు.

టీడీపీలో 200 కుటుంబాలు చేరిక

శ్రీముఖలింగం సర్పంచ్ తమ్మన్నగారి సతీష్, మాజీ ఎంపీటీసీలు టి.ధనలక్ష్మి, అప్పారావుతో పాటు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఎంపీ రామ్మోహన్ నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. 'వైసీపీ పాలనలో శ్రీముఖలింగం అభివృద్ధికి దూరమైంది. చంద్రబాబునాయుడుతోనే అభివృద్ధి సాధ్యం. అందుకే తాము టీడీపీ చేరామ'ని సర్పంచ్‌తోపాటు మాజీ ఎంపీటీసీలు తెలిపారు. శ్రీముఖలింగంతోపాటు కరకవలస కోలనీ, నగిరికటకం, అంధవరం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెలమల రాజేంద్ర నాయుడు, కత్తిరి వెంకటరమణ, శిమ్మ చంద్రశేఖర్, బగ్గు సుగుణమ్మ, బగ్గు గోవిందరావు, పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగస్వామిబాబు, కింజరాపు సత్యం, తర్ర బలరాం, పొన్నాడ దాలయ్య వెంకటదాసు, దేవ, భైరి భాస్కరరావు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టేందుకే 'పోక్సో'

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జేఏ మౌలానా

అరసవల్లి, జనవరి 27: మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచారాలను అరికట్టేందుకే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం పోక్సో చట్టాన్ని తీసుకువచ్చిందని జిల్లా ప్రధాన న్యాయాధికారి జేఏ మౌలానా అన్నారు. శనివారం జిల్లా న్యాయస్థానం సమావేశ మందిరంలో జిల్లా లీగల్ సెల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోక్సో చట్టం అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పోక్సో చట్టం వచ్చిన తరువాత మహిళలపై అఘాయిత్యాలు, హింస తగ్గుముఖం పట్టాయని తెలిపారు. అన్ని వర్గాల మహిళలకు ఈ చట్టంపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లాలో క్రైమ్ రేటును పరిశీలిస్తే మహిళలపై వేధింపులు, ఇతర వివక్ష కేసులు కొంతవరకు తగ్గాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, పలువురు న్యాయాధికారులు, న్యాయ నిపుణులు, న్యాయ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జేఏ మౌలానా

గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ'

గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాలు పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు కొన సాగుతున్నాయి. శనివారం ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను నేతలు, కార్యకర్తలు వివరించారు. అలాగే 'పల్లె పల్లెకు టీడీపీ' నిర్వహించారు. కార్యక్రమాల్లో టీడీపీ-జనసేన క్యాడర్ పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయండి

మెళియాపుట్టి: టీడీపీ, జనసేన కార్యకర్తలు ఎన్నికలు ముగిసే వరకు సైనికుల్లా పనిచేసి టీడీపీ-జనసేన కూటమి విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ మూర్తి అన్నారు. శనివారం చాపర, సుందరాడ, పెద్దపద్మాపురం, సిరియాఖండి గ్రామాల్లో ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మళ్లీ ఓట్లు అడిగేందుకు వస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అడ్డుతోవలో గెలుపొందేలా చూస్తోందని, వీటిని అడ్డుకోవాలని కోరారు. అనంతరం గ్రామాల్లో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వసంత్, పరమేష్‌రెడ్డి, శ్రీధర్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

● **టెక్కలి:** రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. శనివారం బన్నువాడ, మోదుగు వలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి రాష్ట్ర ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరిచిందన్నారు. గ్యాస్, పెట్రోల్, ఫలితంగా మధ్యతరగతి కుటుంబాలపై కూడా భారం పడిందన్నారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు బసవల అప్పలస్వామి, హనుమంతు రామకృష్ణ, ఇప్పిలి జగదీశ్వరరావు, దల్లి ప్రసాద్‌రెడ్డి, ప్రీతీష్ చంద్ర, వట్టికూళ్ల రామకృష్ణ, సనపల మురళి, వట్టికూళ్ల తిరుమలరావు, వట్టికూళ్ల ఢిల్లీ తదితరులు పాల్గొన్నారు.

● **పాతపట్నం:** పాతపట్నంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫల్యాలను, టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

● **జలుమూరు:** టీడీపీ అధినేత చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వంలోనే మరలా అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ అన్నారు. బద్రి ఎస్సీ వీధిలో శనివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ వైఫ ల్యాలను వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో నాయకులు బలగ రవి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

● **పలాసరూరల్:** రాబోయే ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని టీడీపీ నాయకులు అన్నారు. గురుదాసుపురం, బ్రాహ్మణతర్లా, బొడ్డపాడు, లక్ష్మీపురం పంచాయతీల్లో శనివారం పల్లె పల్లెకు టీడీపీ, బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఇతర పార్టీల నుంచి అసంతృప్తి నాయకులు టీడీపీలో చేరుతామంటే వారిని కలుపుకొని వెళ్లాలని, బూత్‌ల నుంచి అధిక శాతం ఓట్లు పడేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పీరికట్ల విఠల్ రావు, కుత్తుమ లక్ష్మణరావు, కిక్కర ఢిల్లీరావు, దువ్వాడ సంతోష్ కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

● **కంచిలి:** టీడీపీతోనే రాష్ట్రభవిష్యత్ సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. శనివారం కొల్లూరు పంచాయతీ కొల్లూరు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి పార్టీ మినీ మేనిఫెస్టోపై వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



కంచిలి: కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు






టెక్కలి: బన్నువాడ, పాతపట్నం, జలుమూరు: బద్రి ఎస్సీ కాలనీ, పలాస రూరల్: గురుదాసుపురంలో 'బాబు ష్యూరిటీ' నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

6న నారా లోకేశ్ రాక



స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి

పాతపట్నం: టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఫిబ్రవరి 6న పాత పట్నం రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తి తెలిపారు. ఈ నేపథ్యంలో సమావేశ నిర్వహణకు గాను స్థానిక పెట్రోల్ బంక్ ఎదురుగా శ్రీనివాస రియల్ ఎస్టేట్ సమీపంలో ఉన్న స్థలాన్ని శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, పట్టణాధ్యక్షుడు సైలాడ సతీష్, నల్లి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

మరింత మెజార్టీ సాధించాలి

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పంచాయతీలో టీడీపీకి మరింత మెజార్టీ సాధించేలా పాటుపడాలని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న అన్నారు. శనివారం సంతబొమ్మాళి, వెంకటాపురం, లక్ష్మీపురం, శివరాంపురం, రెయ్యిపేట, నగిరిపెంట, తెనుగుపెంట, అంట్లవరం గ్రామాల్లో పర్యటించారు. సంతబొమ్మాళి పంచాయతీ టీడీపీకి కంచుకోట అని రానున్న ఎన్నికల్లో మరోసారి నిరూపించాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాడాన వెంకట రమణమ్మ, మాజీ సర్పంచ్‌లు ముద్దపు లచ్చన్న, కూశెట్టి కాంతారావు, మెండ అప్పారావు, సువ్వారి ప్రసాద్, కూశెట్టి భాను ప్రకాష్, దూపాన వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు జీరు భీమారావు

ఆర్టీసీ బస్సుల రద్దుతో అవస్థలు




ఆమదాలవలస వైఎస్ఆర్ జంక్షన్ బస్ షెల్టర్ వద్ద, మెళియాపుట్టి: గొప్పిలిలో బస్సుల కోసం గొప్పిలిలో వేచి ఉన్న ప్రయాణికులు, విద్యార్థులు

మెళియాపుట్టి: వైసీపీ శనివారం భీమిలిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆర్టీసీ బస్సులను తరలించడంతో గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చే ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కువగా పలాస నుంచి గొప్పిలి, టెక్కలిపట్నం వరకు వెళ్లాల్సిన బస్సులు రద్దు చేయడంతో విద్యార్థులు ఇక్కట్లకు గురయ్యారు. ప్రస్తుతం డిగ్రీ పరీక్షలు జరుగుతున్నందున వారు ఇబ్బందులుపడడం కనిపించింది. బస్సులను రద్దు చేస్తున్నామని సంబధిత అధికారులు ప్రకటించకపోవడంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. ● **మందస:** సీఎం జగన్‌రెడ్డి భీమిలిలో నిర్వహించిన పార్టీ సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో శనివారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలాస నుంచి మందస మీదుగా గిరిజన ప్రాంతాలకు తిరిగే ఆర్టీసీ బస్సులను భీమిలికి తరలించడంతో బస్సుల కోసం ప్రజలు ఎదురు చూసి ఇబ్బందులకు గురయ్యారు. ● **ఆమదాలవలస:** భీమిలిలో జరిగిన సీఎం జగన్మోహన్‌రెడ్డి నిర్వహించిన పార్టీ నేతల సభకు అధికారులు ఆర్టీసీ బస్సులు కేటాయించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఆమదాలవలస వైఎస్సార్ జంక్షన్ దగ్గర ఉన్న ప్రయాణికుల విశ్రాంతి భవనం వద్ద విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించాచారు. బస్సులు ఎంతకూ రాకపోవడంతో తిరిగి ఇంటి ముఖంపట్టారు. మరికొందరు ఆటోలు, తదితర వాహనాలను ఆశ్రయించారు. వచ్చిన ఒకటి, రెండు బస్సుల్లో విద్యార్థులు ప్రమాదకర ప్రయాణం సాగించారు.

వైసీపీ నేతల అడ్డాగా ఎంపీడీవో కార్యాలయం



ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం ఎంపీడీవో కార్యాలయం వైసీపీ నాయ కుల అడ్డాగా మారింది. శనివారం విశాఖ జిల్లా భీమిలిలో జరిగిన సీఎం సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వైసీపీ నాయకులు ఇచ్ఛాపురం చేరుకున్నారు. వారు తెచ్చిన ద్విచక్ర వాహనాలను ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పార్కింగ్ చేశారు. దీంతో విధులకు చేరుకున్న అధికారులు, సిబ్బంది ఈ వాహనాలను చూసి అవాక్కయ్యారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చినవారు సైతం ఇక్కట్లకు గురయ్యారు. దీనిపై ఈవోపీఆర్డీ సత్యనారాయణను వివరణ కోరగా.. మేం కార్యాలయానికి వచ్చేటప్పటికే వాహ నాలు పార్కింగ్ చేసి వెళ్లిపోయారని, ఎవరూ మమ్మల్ని అనుమతి కోరలేదని, ఇలా చేయడం సరికాదన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

జలుమూరు: మండల ఏపీటీఎఫ్ మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ మండల అధ్యక్షుడిగా మెండ రామారావు, ఉపాధ్యక్షులుగా పి.ఈశ్వరరావు, పి.చంద్రభూషణ్, కె.రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా ఆనెం శ్రీనివాసరావు, మండల కార్యదర్శులుగా పి.సూర్యనారాయణ, టి.అనిల్‌కుమార్, బి.కేశవరావు, కె.భాగ్యలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దవళ సరస్వతి తెలిపారు. అలాగే జిల్లా కౌన్సిలర్లుగా బి.సింహాచలం, కె.నాగరాజు, పి.నాగరాజు, బి.శంకర్రావు, ఎల్.విజయలక్ష్మి, బి.అప్పయ్యల ఎన్నికయ్యా రన్నారు. కైనట్లు ఆమె తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కార్యదర్శి దవళర సరస్వతి వ్యవహరించారు. ఈ మేరకు నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణం చేశారు. సీపీఎస్ రద్దు కోసం పోరాటం చేయాలని తీర్మానించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నరసన్నపేట: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర ఫుడ్ కమిటీ సోషల్ ఆడిట్ సభ్యులు ఎస్.విద్యాసాగర్, బి.సూర్య సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, శుచి, శుభ్రతను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం సాయి శ్రీనివాస రావు, రామారావు, రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మిడ్డేమీల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు

గణతంత్ర దినోత్సవంలో నందిగాం సర్పంచ్‌కు సత్కారం

నందిగాం: న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ప్రత్యేక ఆహ్వానితురాలిగా పాల్గొన్న నందిగాం సర్పంచ్ జడ్యాడ రమణమ్మకు కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, కపిల్ మోరేశ్వర్ సత్కరించారు. రాష్ట్రం నుంచి గణతంత్ర పరేడ్‌కు 13 మందిని ఎంపిక చేయగా వారిలో నందిగాం సర్పంచ్ ఒకరు. ఈమెకు మంత్రులు దుశ్శాలువా కప్పి జ్ఞాపిక అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని, పరేడ్‌లో సుమారు 90 నిమిషాల పాటు వివిధ కార్యక్ర మాలను చూసి మధురానుభూతిని పొందానన్నారు. ఈమెతో పాటు రాష్ట్ర నోడల్ అధికారి ఎస్ఎస్ మూర్తి, జడ్యాడ జయరాం ఉన్నారు.



కేంద్ర మంత్రి నుంచి సత్కారం పొందుతున్న సర్పంచ్ జడ్యాడ రమణమ్మ

అత్యవసర రోగులకు పారిశుధ్య సిబ్బందే గతి!

● ఇదీ పలాస సామాజిక ఆసుపత్రి తీరు

పలాస: సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర రోగులకు పారిశుధ్య సిబ్బంది వైద్యమే గతవుతోం దన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా శనివారం సాయంత్రం పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ సమయానికి వైద్యులెవరూ లేకపోవడంతో అక్కడున్న పారిశుధ్య సిబ్బంది క్షతగాత్రులకు సపర్యలు చేశారు. ఆతరువాత తీరిగ్గా వైద్యులు వచ్చి రోగులకు వైద్యం అందించినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పేరుకే సామాజిక ఆసుపత్రి అని, రోగులకు వైద్యులు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలున్నాయి. గతంలో ప్రసూతి కోసం వచ్చిన ఓ గిరిజన మహిళకు చివరి నిమిషంలో వైద్యం నిరాకరించడంతో ఆమె 108 వాహనంలోనే ప్రసవించిన విషయం తెలిసిందే. దీనిపై మంత్రి అప్పలరాజు, ఉన్నతాధికారులు వైద్యాధికా రులను హెచ్చరించినా వారిలో చలనం ఉండడం లేదన్న వాదనలొస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇటువంటి ఘటనలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై వైద్యాధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఎవరూ అందుబాటులో లేరు.



క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఒక్కో పార్టీకి ఒక్కో నిబంధనా?

● ఆర్టీసీ అధికారుల తీరుపై టీడీపీ నేతల మండిపాటు

పలాస: అధికార పక్షానికి ఒక నిబంధన, ప్రతిపక్షానికి ఒక నిబంధన అమలు చేసి ఆర్టీసీ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని టీడీపీ జిల్లా కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ భీమిలిలో నిర్వహిస్తున్న సభకు ఆర్టీసీ అధికారులు 50 బస్సులు అప్పనంగా ఇచ్చారని, తాము టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రకు అద్దె ప్రాతిపదికన 25 బస్సులు ఇవ్వాలని కోరినా ప్రయాణికులు ఇబ్బందులు పడతారని ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం వైసీపీకి ఇచ్చిన బస్సుల వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడరా అని ప్రశ్నించారు. సమావేశంలో నేతలు కుత్తుమ లక్ష్మణరావు, సతీష్, అవుగాన దశరథుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీరుకట్ల విఠల్‌రావు

వైసీపీది అధికార దుర్వినియోగం

కాశీబుగ్గ: వైసీపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్ అన్నారు. శనివారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. తాము నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లిలో యువగళం ముగింపు సభకు ఆర్టీసీ బస్సుల కోసం వినతిపత్రం ఇచ్చినా ఆర్టీసీ అధికారులు ఇవ్వలేదని, భీమిలిలో వైసీపీ నిర్వహించిన కార్యక్రమానికి 50 బస్సులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్ని అవాంతరాలు సృష్టించినా టీడీపీ సభకు 7 వేల మంది కార్యకర్తలు వెళ్లే. వైసీపీ బుధవారం నిర్వహించిన సమావే శానికి 2 వేల మంది కూడా వెళ్లలేదని, మంత్రిగా మీ బలం ఇదే అని ఎద్దేవా చేశారు. ఆర్టీసీ అధికారులు పక్షపాత ధోరణి తో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా రన్నారు. కార్యక్రమంలో నాయకులు బడ్డ నాగరాజు, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ గుప్తా, పైల చక్రధర్, గోల చంద్రరావు, మురళీ మోహన్, కొత్త సత్యం, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు నివేదికలిచ్చిన వారిపై చర్యలు తీసుకోండి

కోటబొమ్మాళి: భూ హద్దుల సర్వేలో తప్పుడు నివేదిక లిచ్చి దళితులపై దాడులకు కారకులైన మండల సర్వే యర్, చిట్టివలస గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట తులసిపేటకు చెందిన దళితులతో కలిసి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. చిట్టివలసలో సర్వే నెంబరు 198లో వండాన రాజేశ్వరమ్మ రిజిస్ట్రేషన్ ద్వారా 0.42 1/2 సెంట్ల భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నారని, అయితే 0.89 సెంట్ల భూమికి హద్దులను సర్వేలో ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించారు. తప్పుడు నివేదిక ఇచ్చిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి, టెక్కలికి సబ్ కలెక్టర్‌ను ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదని, దీనిని నిరసిస్తూ దీక్ష చేపట్టా మన్నారు. బాధితులకు న్యాయం జరిగేవరకు పోరాటం సాగుతుందన్నారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి డివిజన్ కార్యదర్శి లోపించి మనో హర్, కొల్లి శ్రీను, చిట్ట అప్పన్న, చిట్టిరేవతి, కొల్లి లక్ష్మి, కిర్రు నరసమ్మ, చిన్నారావు పాల్గొన్నారు.



నిరసన దీక్ష చేపడుతున్న దళిత నేతలు

దివ్యాంగుల ధర్నా రేపు

టెక్కలి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఆవుల వేణు గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పింఛన్‌ను అందజేయాలని కోరుతూ ఈ ధర్నా నిర్వహించ నున్నామని, దివ్యాంగులు హాజరై విజయవంతం చేయాల న్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం

వజ్రపుకొత్తూరు: బాతుపురం పంచాయతీకి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు బత్తిని రామారావు మృతి చెందడంపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు. శనివారం ఆయన మృతదేహం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బత్తిన మోహనరావు, బుల్లోజు శశిభూషణ్, బత్తిన మహేష్, నగేష్ పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

నరసన్నపేట: స్థానిక సబ్ జైలును మున్సిఫ్ కోర్టు న్యాయాధికారి సి.హరిప్రియ శనివారం పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న భోజనం, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారా తప్పులు చేసేందుకు అవకాశం ఉండదన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని రిమాండ్ ఖైదీలకు సూచించారు. వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సంతబొమ్మాళి: నౌపడ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్నందున ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

బ్లడ్‌బ్యాంకు లేకపోవడం దారుణం



రక్తదాతలను అభినందిస్తున్న దుర్గారావు

వజ్రపుకొత్తూరు: పలాస 200 పడగల ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిద ర్శనమని జనసేన పలాస సమన్వయకర్త వి.దుర్గారావు అన్నారు. శనివారం పల్లిసారధిలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధి తో బాధపడుతున్న వారు తనను కలిసి వారు ఎదుర్కొం టున్న సమస్యలు వివరించారన్నారు. వారికి నిత్యం రక్తం అవసరం ఉన్నప్పటికీ పలాస ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా రక్తం అందిం చేందుకు బ్లక్ బ్యాంక్ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

వజ్రపుకొత్తూరు: జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా కార్యదర్శి వంకల పాపయ్య డిమాండ్ చేశారు. శనివారం మర్రిపాడులో ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల జీవ నాధారమైన జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పంటలకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక రైతులు అప్పులపాలవుతున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీరాస్వామి, సొర్ర రామారావు, యరకయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

యంగ్ ఇండియా సదస్సును విజయవంతం చేయండి

టెక్కలి: విజయవాడలో సోమవారం నిర్వహించనున్న యంగ్ ఇండియా సదస్సును విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్ కోరారు. శనివారం టెక్కలిలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి హక్కులను కాపాడుకో వాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కిశోర్, సూర్య, మహేష్, పృథ్వి, గణేష్, కరుణాకర్ పాల్గొన్నారు.

టెక్కలి అర్బన్ సీఐగా పైడయ్య

టెక్కలి రూరల్: టెక్కలి అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పల్ల పైడయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమదాలవలస నుంచి ఇక్కడికి వచ్చారు. టెక్కలి పోలీస్ సర్కిల్ స్టేషన్‌కు ఈయన స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.



సిబ్బంది ఎక్కువ.. రోగులు తక్కువ

మెళియాపుట్టి: ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. శనివారం రెండో విడత కార్యక్రమాన్ని జాడుపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరానికి వైద్య సిబ్బంది ఎక్కువగా రాగా రోగులు నామమాత్రంగా వచ్చారు. కొందరు వైద్య పరీక్షలు చేయించుకున్నా అవసరమైన మందులు లేకపో వడంతో వెనుదిరిగారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కోటబొమ్మాళి: స్థానిక కొత్తపేట ఇందిరమ్మ కాలనీకి చెందిన నీలాపు లీలామోహన్ (15) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్ఐ షేక్ మహ్మద్‌అలీ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. లీలామోహన్ ఈ నెల 24న సాయంత్రం మేడ మీద ఆడుకుంటూ కాలుజారి కిందపడడంతో తలకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే శ్రీకాకుళం జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి నీలాపు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

● మానవత్వం చాటుకున్న హెడ్‌కానిస్టేబుల్


అంత్యక్రియలకు తరలిస్తున్న సాధువు మృతదేహం

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి దాసన్నపేట జంక్షన్ రామలింగేశ్వర ఆలయం వద్ద అనారోగ్యంతో మృతి చెందిన ఓ అనాథ సాధువుకు టౌన్ పోలీసుస్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న రామారావు శనివారం అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు. ఆలయ పూజారి కథనం మేరకు.. గత పదేళ్లుగా సాధువు శివకుమార్ బాబా ఆలయం వద్దే ఉంటున్నాడు. ప్రతీ రోజూ ఆలయానికి వచ్చే భక్తులు ఇచ్చే డబ్బులతోపాటు ఆలయ పూజారి పెట్టిన భోజనం చేస్తూ జీవితం గడిపేవాడు. ఈ క్రమంలో కొన్నాళ్లగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హెచ్‌సీ రామారావు తన సొంత ఖర్చులతో బాహుదానదిలోని శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు 9వ వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర సహకరించారు. హెచ్‌సీ ఇచ్ఛాపురం వచ్చి తన ఎనిమిదేళ్ల సర్వీస్‌లో 25 అనాథ శవాలకు తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించడం విశేషం. పెద్దకర్మ కూడా నిర్వహిస్తానని హెచ్‌సీ తెలిపారు.

జిల్లాలో అత్యాధునిక కేన్సర్ ఆసుపత్రి

● కలెక్టర్ శ్రీకేష్ లఠ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్

కలెక్టరేట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలో అత్యాధునిక సౌకర్యాలతో త్వరలోనే కేన్సర్ ఆసుపత్రిని నిర్మించనున్నట్టు కలెక్టర్ శ్రీకేష్ బి.లఠ్కర్ తెలిపారు. మగటపల్లి చారిటబుల్ ట్రస్టు ఆర్థిక సహకారంతో రూ.25 లక్షలతో నిర్మించిన శాంతా కల్యాణ్ అనురాగ నిలయం రక్షిత గృహం(బాలురు), సీవీ నాగజ్యోతి ఆనందనిలయం (పురుషుల వృద్ధాశ్రమం)లను శనివారం ఆయన జేసీ నవీన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కేన్సర్ ఆసుపత్రి కోసం ఏడు ఎకరాల స్థలం కేటాయించామని, త్వరలోనే అన్ని అనుమతులు వస్తాయని వెల్లడించారు. హైదరాబాదు, వెల్లూరు వంటి దూర ప్రాంతాలకు వెళ్లి రోగులు ఎంతో వ్యయ, ప్రయాసలు పడుతున్నారన్నారు. ఆసుపత్రి నిర్మాణంతో ఆ కష్టం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం.నవీన్, రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు, వరదరాజులు, సీవీఎన్ మూర్తి, పీఎల్ఎన్ రాజు, పెంకి చైతన్య, సోమేశ్వరరావు, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయాలి: ఎస్పీ రాధిక


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆమదాలవలస సీఐ వాయునందన్

శ్రీకాకుళం క్రైం: ప్రజలకు సేవలందించడంలో పోలీసులు బాధ్యతగా పనిచేయాలని నూతనంగా పదోన్నతి పొందిన పలువురు సీఐలకు ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీను సీఐలు ఎల్.రామకృష్ణ, ఎ.లక్ష్మణరావు, జి.వాయునందన్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

పాదయాత్ర విజయవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కులపెద్దలు

ఇచ్ఛాపురం: సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు చేపట్టనున్న ఉత్తరాంధ్ర తెలగ కులస్థుల ఆత్మగౌరవ పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలగ కులస్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆదివారం మధ్యాహ్నం 12గంటలకు అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఈ పాదయాత్రను కుల పెద్దలు పల్లంట్ల వెంకటరామారావు ప్రారంభిస్తారని తెలిపారు. తెలగ కులస్థుల సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన ఈ పాదయాత్రలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుల పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు డి.బొండపల్లి ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థి భవానీ ఎంపికైంది. గతేడాది సెప్టెంబరులో శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎం.కూర్మినాయుడు తెలిపారు. ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు పల్నాడు జిల్లా నర్సారావుపేట డీఎస్ఏ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనున్నట్టు ఆయన తెలిపారు. ఈమె ఎంపికపై పీడీ భాగ్యలక్ష్మి, కాంచన, బానోజీ పాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

హైవే ఫుట్‌పాత్ ఆక్రమణ

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలం మునసబుపేట సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డు ఫుట్‌పాత్ ఆక్రమణకు గురవుతోంది. ఈ ఫుట్‌పాత్‌పై ఓ కంపెనీ కంటైనర్లను ఏర్పాటు చేసి నివాసయోగ్యంగా మార్చేశారు. సుమారు 30 మంది ప్రతిరోజూ ఈ కంటైనర్లలో ఉంటూ ఓ వివాదస్పద స్థలానికి కాపలా కాస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం తమ దృష్టికి రాలేదని జాతీయ రహదారి భద్రతా అధికారులు చెబుతున్నారు. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్ ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన కంటైనర్లు

జగన్‌ను తరిమికొడితేనే రాష్ట్రానికి భవిష్యత్

● ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం,(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని తరిమికొడితే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి శ్రీకాకుళం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బలగమెట్టు వద్ద జరిగిన బహిరంగ సభలో ఎంపీ మాట్లాడుతూ.. జగన్‌రెడ్డి తీరును వైసీపీ కార్యకర్తలే అసహ్యించుకుంటున్నారన్నారు. జనాలను భయపెట్టి మళ్లీ అధికారంలోకి రావాలని జగన్‌రెడ్డి భావిస్తున్నాడని చెప్పారు. ప్రజలకు రూ.10 పంచి, రూ.100 దోచుకుంటున్నాడని విమర్శించారు. అన్ని రంగాల్లోనూ జగన్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని తూర్పారాబట్టారు. జగనే ఓడిపోవడానికి 'సిద్ధం' అయిపోయాడని ఎద్దేవా చేశారు. సొంత చెల్లి కూడా జగన్ నైజాన్ని బట్టబయలు చేశారన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్ నంబర్‌వన్‌గా ఉండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏ ఒక్క వర్గాన్ని విడిచిపెట్టకుండా దోచుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, పార్టీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నాయకులు రెడ్డి చిరంజీవి, శివన్నారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి


పెంట గ్రామంలో పర్యటిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు

జి.సిగడాం: పరిపాలన చేతకాని జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు విమర్శించారు. పెంట గ్రామానికి చెందిన నీటి సంఘం మాజీ అధ్యక్షుడు మీసాల అప్పలసూరి, దవళపేటకి చెందిన బొడ్డేపల్లి వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. అలాగే ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స చేయించుకున్న పెంట గ్రామానికి చెందిన డీలర్ మీసాల నారాయణరావును, సుమారు నాలుగు ఎకరాల వరికుప్పలు అగ్నికి ఆహుతైన బాధిత రైతు కిల్లారి రమణను ఆయన పరామర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో తగ్లక్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయన్నారు. జగన్‌రెడ్డి అరాచక పాలనకు రాష్ట్ర ప్రజలు విసుగుచెందారని, ఎప్పుడు ఎన్నిలకు వస్తాయా వైసీపీని, జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చిన ఏకైక సీఎం జగన్‌రెడ్డేనని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధితో పాటు సరైన గాడీలో పెట్టే విజన్‌గల నాయకుడు ఒక్క చంద్రబాబేనన్నారు. అందుకోసం ప్రతీ కార్యకర్త రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈయన వెంట నాయకులు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు, కంచరాన సూరన్నాయుడు, ఆరెళ్ల గొల్లాజీ, పైల రామకృష్ణంనాయుడు, జక్కంపూడి దాసు, కోన వెంకటరావు, మహదాశ్యం చిన్నారావు తదితరులు ఉన్నారు.

టీడీపీ విజయానికి సైనికుల్లా పోరాడండి


మాట్లాడుతున్న పీఎంజే బాబు

పొందూరు: రానున్న ఎన్నికల్లో వైసీపీ దుష్టపాలనను అంతమొందించి.. ప్రజలకు సుపరిపాలన అందించేందుకు టీడీపీ విజయానికి సైనికుల్లా పోరాడాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కూన సత్యనారాయణ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డబ్బు, అధికారంతో వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడే అవకాశం ఉందని, వీటిని సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నెపు రాము, వండాన మురళి, గాడు నారాయణరావు, సీపాన శ్రీరంగనాయకులు, బలగ శంకరభాస్కర్, బాడాన గిరి, చింతాడ వాసుదేవరావు, అనకాపల్లి చినరంగ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చెత్త డబ్బా ఇలా.. చెత్తేసేది ఎలా?


పూర్తిగా పాడైన చెత్త డబ్బా

ఆమదాలవలస: మండలంలోని బొడ్డేపల్లి పేట ప్రధాన రహదారి పక్కన కొన్ని రోజుల నుంచి చెత్త డబ్బా పూర్తిగా పాడై ఉంది. దీంతో స్థానికులు చెత్తను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. కొత్త చెత్త డబ్బాను ఏర్పాటు చేయాలని కోరుతున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

టీడీపీ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

● పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్


మాట్లాడుతున్న కూన రవికుమార్

సరుబుజ్జిలి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. కొత్తకోట గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు అంబాళ్ల రాంబాబు అధ్యక్షతన శనివారం జరిగిన కార్యకర్తల శిక్షణ తరగతుల కార్యక్రమంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామ పంచాయతీలో పార్టీ కన్వీనర్లు, పోలింగ్‌స్టేషన్ ఏజెంట్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, కస్టర్ ఇన్‌చార్జిలు ప్రతీ ఇంటికి వెళ్లి వైసీపీ పాలన ఎంత దారుణంగా ఉందో ప్రజలకు వివరించి చైతన్యవంతులు చేయాలన్నారు. రాష్ట్రంలో మారుతున్న సమీకరణలతో ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఆయుధంగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్యనారాయణ, నాయకులు నందివాడ గోవిందరావు, పల్లి సురేష్, కిల్లి సిద్దార్థ, వెలమల రమేష్, గండెం రవికుమార్, నూక ప్రభాకర్, సువరపు తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న విద్యాసాగర్

ఆమదాలవలస: మునిసిపాలిటీలోని 23 వార్డుల్లో ఉన్న కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేసి వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలని పార్టీ జిల్లా న్యాయ విభాగ నాయకుడు తమ్మినని విద్యాసాగర్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాల యంలో పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళీధరరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అసమర్థ పాలనను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, నాయకులు కూన అప్పలనాయుడు, కూన రాము, బీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో పని చేయని లిఫ్టులు.. రోగుల అవస్థలు


లిఫ్టు వద్ద పడిగాపులు కాస్తున్న రోగులు

శ్రీకాకుళం క్రైం, జనవరి 27: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో గత మూడు రోజులుగా లిఫ్టులు పని చేయడం లేదు. దీంతో రోగులు మూడు అంతస్తులు ఎక్కేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్వహణ భారం పేరిట రిమ్స్ అధికారులు లిఫ్టులను ఆపేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. రిమ్స్‌లోని మొదటి మూడు అంతస్తుల్లోనే ముఖ్యమైన విభాగాలు ఉన్నాయి. ఇక్కడకు చేరుకునేందుకు రోగులు పాట్లు పడుతున్నారు. లిఫ్టులు పని చేయకపోవడంతో ఉసూరుమంటూ మెట్లు ఎక్కి పైకి వెళ్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల బాధలు వర్ణనాతీతం. మరో పక్క ఆస్పత్రిలో వీల్ చైర్‌లు(స్ట్రెక్చర్లు) కూడా పూర్తిస్థాయిలో లేవు. శనివారం గార మండలం దువ్వపేట గ్రామానికి చెందిన పాత్రలపల్లి కరోవుడు అనే 78 ఏళ్ల వృద్ధుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రిలో చేరాడు. అయితే లిఫ్టులు పని చేయకపోవడంతో అతడిని వార్డుకి తరలించేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడ్డారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని రోగులు మండిపడుతున్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ నిరసన


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ శనివారం నిరసన తెలిపారు. పాలపోలమ్మ గుడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. థామస్ అల్వా ఎడిషన్ జనవరి 27న విద్యుత్ బల్బు కనుగొన్నారని, ఆ రోజును ఎలక్ట్రిషియన్‌డేగా గుర్తించాలని ప్రభుత్వాలను ఆరేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జనవరి 27న ఎలక్ట్రిషియన్‌డేగా గుర్తింపు ఇవ్వాలని కోరారు. ఈ ర్యాలీలో శ్రీనివాసరావు, చిన్నారావు, హరిబాబు, గున్నయ్య, పకీరునాయుడు, కృష్ణ, రామారావు, సలీం, రవి, తేజ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం స్పోర్ట్స్: ఇటీవల నంద్యాల్లో జరిగిన అండర్-17 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్లు పాల్గొనగా, అందులో ఇద్దరు క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు పి.శివరామకృష్ణ (శ్రీకాకుళం), ఎం.మణికంఠ (మందస) ఎంపికయ్యారు. వీరు ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు ఔరంగాబాద్‌లో జరగనున్న జాతీయ పోటీలో పాల్గొంటారని డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలియజేశారు.

రేపటి నుంచి ఇంజనీరింగ్ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నట్టు పరీక్షల డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు బ్రాంచ్‌ల్లో మొత్త 252 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం


మాట్లాడుతున్న శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణరాజు

అరసవల్లి: సేవా రంగాల్లో లోపాలకు సత్వర న్యాయం లోక్ అదాలత్ ద్వారా పొందవచ్చని శాశ్వత లోక్ అదాలత్ జిల్లా చైర్మన్ జ్ఞాన సువర్ణరాజు అన్నారు. తన కార్యాలయంలో శనివారం ఆయన జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో ప్రజా ప్రయోజన సేవలపై, ఆయా శాఖలు చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సత్వర న్యాయం, ఉచితంగా అందించేందుకు లోక్ అదాలత్ పనిచేస్తుందని, ఇక్కడ లభించే తీర్పు సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సమానమన్నారు. తీర్పు వెలువడ్డాక పై కోర్టుకు అప్పీల్ అనేదే ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పీడీ గణపతిరావు, ఏపీ ఎస్ఆర్టీసీ నుంచి దక్షిణామూర్తి, ఉపాధి హామీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూర్మనాథుని సన్నిధిలో జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారిణి


క్రీడాకారిణిని సన్మానిస్తున్న ఆలయ ఈవో

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథుని జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారిణి కరగాన సంధ్య శనివారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంధ్యకి దేవస్థానం తరపున ఈవో గురునాథరావు సన్మానించారు. అలాగే విజయవాడకి చెందిన భాస్కరరెడ్డి స్వామి వారి నిత్యాన్నదాన పథకానికి రూ.25 వేలు విరాళంగా ఈవోకి అందచేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సీతారామ నరసింహాచార్యులు, నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐగా బాధ్యతలు

శ్రీకాకుళం క్రైం: ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) శ్రీకాకుళం సీఐగా బదిలీపై వచ్చిన ఎంవీ గోపాలకృష్ణ శనివారం బాధ్యతలు చేపట్టారు. 2005 బ్యాచ్‌కి చెందిన గోపాలకృష్ణది పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

లావేరు: జగన్ పత్రికలో లావేరు మండల విలేకరిగా పనిచేస్తున్న కేవరాయిపురం గ్రామానికి చెందిన గురిజా దామోదరరావు గత నెల 28న ఆత్మహత్య చేసుకున్నాడని, ఈ మృతిపై ప్రభుత్వం స్పందించి సమగ్ర దర్యాప్తు చేపట్టేలా చూడాలని అతడి సోదరుడు శ్రీనివాసరావు జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఈ నెల 26న తెనాలిలోని నాదెండ్ల మనోహర్‌ను కలిసి తన సోదరుడు దామోదర్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఇందుకు సంబంధించిన పత్రాలను మనోహర్‌కు అందచేశారు. ఈ విషయాన్ని పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు చెప్పారని తెలిపారు.

కొమ్మ మోడింది.. పూత అదిరింది



ఆమదాలవలస: ఆమదాలవలస మునిసిపాలిటీ వెంగళరావు కాలనీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఓ మామిడి చెట్టు కొమ్మ విరిగి మోడుబారింది. అయినప్పటికీ ఆ కొమ్మ నిండా మామిడి పూత విపరీతంగా వచ్చింది. ఆ మార్గంలో వెళ్లే పాద చారులు, ద్విచక్ర వాహనదారులు ఈ పూతను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధా.. అదెక్కడా?

● గిరిజన గ్రామాల్లో కానరాని కనీస వసతులు
● అవస్థలు పడుతున్న ఆ గ్రామాల ప్రజలు
● పట్టించుకోని పాలకులు


రేకుల షెడ్‌లోనే వెన్నెలవలస అంగన్‌వాడీ భవనం


బవస మామిడివలసలో పూరిళ్లు

సరుబుజ్జిలి, జనవరి 27: మండలంలో ఉన్న మూడు గిరిజన గ్రామాలు కూడా నాలుగున్నరేళ్లుగా మౌలిక వసతులు, అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నా.. నేటికీ ఎటువంటి మంజూరు లేక గిరిజనుల నిరీక్షణ ఎండమావిగానే కనిపిస్తుంది. చిగురువలస గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న వెన్నెలవలస, బరికిపేట, బసవ మామిడివలస ఈ మూడు గిరిజన గ్రామాలే సరుబుజ్జిలి మండలంలో ఉన్నాయి. ప్రభుత్వం ఐటీడీఏల ద్వారా గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని వైసీపీ ప్రభుత్వం బాకాలు ఊదుతున్నా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆ గ్రామాల పరిస్థితి తెలుస్తుంది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఉన్న ఈ మూడు గ్రామాలు కూడా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెన్నెలవలస గ్రామంలో నేటికీ శిథిలావస్థలో ఉన్న పురాతన రేకులషెడ్ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇది ఏ క్షణాన కూలిపోతుందోనని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గ్రామంలో ఇప్పటికీ కూడా సరైన రోడ్లు లేకపోగా, ఇంటింటికి కొళాయి అంటూ ఉన్న రోడ్లు తవ్వేసి అసంపూర్తిగా వదిలేదిలేశారని మండిపడుతున్నారు. బరికిపేట గిరిజన గ్రామంలో ఒక పక్కా భవనం ఎవరికీ నేటికీ మంజూరు చేయకపోవడం ఈ గ్రామంపై పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనంగా చెప్పవచ్చు. గ్రామంలో పాఠశాల లేక పక్క గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు అడవి తుప్పల మధ్య చిన్నారులు వెళ్లడం నిత్యకృత్యంగా మారింది. బవస మామిడివలస గ్రామంలో పక్కా భవనాలు మాట ఎలా ఉన్నా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఇక్కడ గిరిజనులు తాగునీటి వసతి లేక ఊటబావులపై ఆధారపడాల్సి వస్తుంది. దీంతో చాలామంది రోగాల బారిన పడుతున్నారు. నవరత్నాల రూపకల్పనతో సమగ్ర అభివృద్ధి సాధించామని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్న పాలకులు ఓసారి సరుబుజ్జిలి మండలంలోని ఈ మూడు గిరిజన గ్రామాలను పరిశీలించి, ఆయా గ్రామాల ప్రజలు పడుతున్న అవస్థలు పరిశీలించి పరిష్కరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.